క్లుప్తంగా

మెరుగైన వైద్య సేవలందించాలి



జఫర్‌గఢ్: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధీర్ కోరారు. మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సుధీర్ బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, వైద్యులు, వైద్య సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్నారు.

వెంకన్నను దర్శించుకున్న ఎక్సైజ్ అధికారులు



చిల్పూరు: చిల్పూరు బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో బుధవారం జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ అనిత, సీఐ ప్రభావతి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎక్సైజ్ సీఐ భాస్కర్‌రావు, ఎస్సైలు నరేశ్, సుధామాధురి సిబ్బంది దర్శించుకున్నారు. అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావులు స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.

యాదగిరిగుట్ట గిరిప్రదక్షిణకు తరలిన భక్తులు



జనగామ: ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి జన్మ స్వాతి నక్షత్రం పురస్కరించుకుని బుధవారం జరిగిన గిరిప్రదక్షిణకు జిల్లా నుంచి వేలాది మంది భక్తులు తరలి వెళ్లారు. గిరిప్రదక్షిణ తర్వాత మెట్ల మార్గం గుండా కొండపైకి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు ధర్మపురి శ్రీనివాస్, చింతకింది మల్లేశం, రాము, చెంచారపు బుచ్చిరెడ్డి, శివ, దొంతుల చంద్రమౌళి, ఉడుగుల నర్సింహులు తదితరులు ఉన్నారు.

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని స్వయం భూ లక్ష్మీనర్సింహస్వామి గుట్టచుట్టూ స్వాతి నక్షత్రం పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు గిరి ప్రదక్షిణ చేసి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆర్యవైశ్య బృందం అన్నదానం చేసింది.

కడియంపై ఆరోపణలు చేస్తే సహించం

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేశ్



చిల్పూరు: ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై ఎవరైనా ఆరోపణలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డమీది సురేశ్, వెంకటస్వామి, జీడీ రమేశ్, ఇల్లందుల యాదగిరి అన్నారు. మండలంలోని చిన్నపెండ్యాల గ్రామంలో బుధవారం గజ్జెల దామోదర్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కడియంపై మరోసారి ఆరోపణలు చేస్తే బీఆర్‌ఎస్ నాయకుడు కేశిరెడ్డి మనోజ్‌రెడ్డిని దళితులమంతా ఏకమై తరిమి కొడతామని హెచ్చరించారు. అభివృద్ధి ప్రదాత కడియం శ్రీహరిని విమర్శించే హక్కు లేదన్నారు. బాలరాజు, సమ్మయ్య, లింగారెడ్డి, అశోక్‌పాల్, దారం రాజన్‌బాబు, రత్నాకర్‌రెడ్డి, సాంబారి రాజేశ్వర్, హరిబాబు, రాజవరం జక్కుల రాజయ్య, సాంబారి శ్రీను పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ పనులు ప్రారంభం

జనగామ: పట్టణంలోని 16వ వార్డులో ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలను మార్చే పనులను కౌన్సిలర్ గాదెపాక రాంచందర్ బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మున్సిపల్ నిధులను ఖర్చు చేస్తూ విద్యుత్తు లైన్ల మార్పు చేస్తున్నట్లు చెప్పారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు



పాలకుర్తి: ఈరవెన్ను గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆత్మీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం క్రీడా పోటీలు నిర్వహించారు. పురుషోత్తం, సోమేశ్వర్, మదార్, కేశవరావు, వెంకటేశ్వర్లు, తుడుసు మల్లేశం, జక్కుల రాజు, యార రాజు, అనుముల మహేందర్, హెచ్ఎం నరేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మరమ్మతుకు నోచుకోని రహదారులు

- ఏడాదిగా పట్టించుకోని పరిస్థితి
- తరచూ ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు

జఫర్‌గఢ్: గత ఏడాది కురిసిన భారీ వర్షాలు, వరద ఉధృతికి మండలంలో పలు రహదారులు కోతకు గురయ్యాయి. వీటిని ఇప్పటి వరకూ ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. దీనివల్ల వాహనదారులు, ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కూనూర్ గ్రామం నుంచి ఉప్పుగల్లు మీదుగా స్టేషన్‌ఘన్‌పూర్‌కు వెళ్లే ప్రధాన రహదారి గతేడాది కురిసిన భారీ వర్షాలు, వరద తాకిడికి కూనూర్, ఉప్పుగల్లు గ్రామాల మధ్య పెద్ద చెరువు మత్తడి సమీపంలో పెద్ద ఎత్తున కోతకు గురైంది. దీనివల్ల అప్పుడు మూడు రోజుల పాటు రాకపోకలు సైతం నిలిచిపోయాయి. ఇదే రహదారిలో కూనూర్, గర్మిళ్లపల్లి గ్రామాల మధ్య కల్వర్టు సమీపాన కూడా రోడ్డు భారీగా కోతకు గురైంది. ఆ సమయంలో కూనూర్ నుంచి గర్మిళ్లపల్లి మీదుగా రహదారి విస్తరణ పనులు జరుతుండడంతో సంబంధిత కాంట్రాక్టర్ కోతకు గురైన చోట వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. కూనూర్–ఉప్పుగల్లు, తమ్మడపల్లి (ఐ)–ఉప్పుగల్లు మధ్య ఉన్న రహదారులు వరద ఉధృతితో పలు చోట్ల కోతకు గురయ్యాయి. అధికారులు వీటికి ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టలేదు. దీంతో ధ్వంసమైన రోడ్ల మీదుగా ప్రజలు ఇబ్బందులు పడుతూ ప్రయాణం సాగించాల్సి వస్తోంది. కోనాయిచలం, సాగరం క్రాస్ రోడ్డు మధ్య ఉన్న ప్రధాన రహదారి కల్వర్టు వద్ద కోతకు గురికావడంతో తాత్కలిక మరమ్మతు చేపట్టారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని పాలకులు, సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు స్థానికులు తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ రహదారుల మీదుగా నిత్యం స్టేషన్‌ఘన్‌పూర్, కాజీపేట, హనుమకొండ, వరంగల్ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్లు ఇలా ఉండటంతో రాత్రి వేళల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, కోతకు గురైన కూనూర్ రోడ్డు వద్ద ఇటీవల కారు బోల్తా పడి ప్రాణాప్రాయం తప్పింది. ఇప్పటికైనా కోతకు గురైన రోడ్లలను వెంటనే మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.





కూనూర్ గ్రామ సమీపాన కోతకు గురై ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

కోతకు గురైన రోడ్లను బాగు చేయాలి



కూనూర్ నుంచి ఉప్పుగల్లు మీదుగా స్టేషన్‌ఘన్‌పూర్‌కు వెళ్లే ప్రధాన రహదారి గ్రామ పెద్ద చెరువు సమీపాన భారీ వర్షాలకు కల్వర్టు వద్ద భారీగా ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియడం లేదు. వెంటనే రోడ్లను బాగుచేయాలి.

– శాస్త్రబోయిన నరేశ్, కూనూర్

ఎవరూ పట్టించుకోవడం లేదు..



కోతకు గురైన రోడ్డు ప్రమాదకరంగా ఉంది. ఈ రోడ్డును బాగు చేసే విషయంలో ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇటీవల రోడ్డుపై కారు బోల్తాపడి పలువురికి గాయలయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతకు గురైన రోడ్డును వెంటనే బాగు చేయాలి.

– కోట నాగరాజుగౌడ్, కూనూర్

కనుల పండువగా 'అయోధ్య' వేడుకలు



సంబురాలు జరుపుకుంటున్న భక్తులు

జనగామ: హిందువుల ఆరాధ్య దైవం అయోధ్య బాలరాముని ప్రతిష్టాపన జరిగి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లాలోని ఆలయాల్లో బుధవారం భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. పట్టణంలోని గుండ్లగడ్డ శ్రీ ఉమామహేశ్వర ఆలయంలో శ్రీ ఆంజనేయస్వామికి 108 వడలతో తయారు చేసిన మాలలు, తమలపాకులు, తీరొక్క పూలమాలతో అలంకరించారు. తులసి కోటలు, ఇంటి గుమ్మాలు, ఆలయాల్లో దీపాలను వెలిగించి ప్రజలు భక్తిని చాటుకున్నారు. బీజేపీ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్త, వీరలింగం, రాముని అనురాధ, రేణుక, ఉమా, రాణి, హైమా, రఘు, ప్రకాష్, నర్సింగారావు, శ్రీకాంత్, శాన్విత పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తదితరులు

పాలకుర్తి టౌన్: విద్యార్థి,యువత భవిష్యత్‌ను నాశనం చేస్తున్న డ్రగ్స్ మహమ్మరిని తరిమికొట్టి ,డ్రగ్స్ రహిత సమామాజాన్ని నిర్మించేందుకు తమ వంతు తోడ్పాటునందించాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పార్టీ మండల కార్యాలయంలో నుంచి రాజీవ్ చౌరస్తా వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. అనంతరం యూత్ కాంగ్రెస్ నియోజవర్గ ఇన్‌చార్జ్ ధారవత్ రాజేష్‌నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాలకుర్తి నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ హనుమండ్ల ఝాన్సీరెడ్డి, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పాల్గొని మాట్లాడారు. నార్కోటిక్ డీఎస్పీ సైదులు, తొర్రూరు, పాలకుర్తి, కొడకండ్ల మార్కెట్ చైర్మన్‌లు తిరుపతిరెడ్డి, మంజుల, అండాలు, కొడకండ్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, కుమారస్వామి, ఎంఈఓ పోతుగంటి నర్సయ్య, సీఐ గట్ల మహేందర్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ సంతోష్‌రెడ్డి, ఎస్సైలు పాల్గొన్నారు.

విద్యార్థుల చేతుల్లో కాంగ్రెస్ జెండాలు

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీలో విద్యార్థుల చేతికి కాంగ్రెస్ జెండాలు అందించడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటన బుధవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువజ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ తీశారు. విద్యార్థులకు డ్రగ్ వల్ల కలిగే దుష్పరిణామలపై ప్లకార్డులు ఇవ్వాల్సిందిపోను నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి ఫొటోతో ఉన్న జెండాను అందించడం చర్చనీయశంగా మారింది.

హామీల అమలుకు పోరాడుతాం

- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



రైతు నిరసన దీక్షలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

లింగాలఘణపురం: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేంత వరకు పోరాడుతూనే ఉంటామని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. రైతులకు ఇచ్చిన రూ.2లక్షల రుణమాఫీపై బుధవారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసు ఆధ్వర్యాన స్థానికంగా రైతు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ జనవరి 26వ తేదీ వరకు రైతు భరోసా ఎకరానికి రూ.15వేలు, ప్రతీ రైతుకు రుణమాఫీ, ధాన్యానికి ఇస్తానన్న రూ.500 బోనస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే నాలుక చీరుస్తాం

కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవితపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే నాలుక చీరుస్తామని మాజీ ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. కడియం శ్రీహరి అవకాశవాద రాజకీయాలు చేస్తూ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని, మళ్లీ బిడ్డకు కేంద్రంలో మంత్రి పదవి ఇస్తానంటే బీజేపీలో కూడా చేరేందుకు ఆయన సిద్ధంగా ఉంటాడని విమర్శించారు. రైతు నిరసన దీక్షలో టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చేవెళ్లి సంపత్, నాయకులు చౌదరిపల్లి శేఖర్, వీరయ్య, భాగ్యలక్ష్మి, మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, ఎడ్ల రాజు, శ్రీహరి, మహేశ్, సుధీర్, రవీందర్‌రెడ్డి, రాహుల్, కరుణాకర్, అనిల్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు



చిల్పూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ శివరాజ్

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

చిల్పూరు: రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని చిన్నపెండ్యాల గ్రామంలో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లిస్టులో పేర్లు రాలేదని ఆందోళన చెందవద్దని, దరఖాస్తుల ప్రకియ నిరంతరం కొనసాగుతుందన్నారు. చిన్నపెండ్యాల గ్రామం జాతీయ రహదారిలో సెంట్రల్ లైటింగ్ కోసం రూ.29 లక్షలు మంజూరు అయ్యాయని, దీంతో పాటు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రజలు సహకరిస్తే త్వరలో ఆపని పూర్తి చేయిస్తానన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకన్న, డీపీఓ స్వరూపరాణి, మండల ప్రత్యేకాధికారి మాధవీలత, తహసీల్దార్ సరస్వతి, ఎంపీఓ మధుసూదన్, ఆర్ఐ చీకటి వినీత్, తాళ్లపల్లి సమ్మయ్య ఇల్లందుల యాదగిరి, లింగారెడ్డి, కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే లక్ష్యం

కొడకండ్ల: నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రజాపాలన చేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. రామన్నగూడెంలో జరిగిన గ్రామసభలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యవసాయాధికారి విజయ్‌రెడ్డి, డీటీ దేవానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్ పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు

రఘునాథపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం అమలు చేయనున్న సంక్షేమ పథకాలు రాజకీయాల కతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతాయని మాజీ జెడ్పీటీసీ, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఇబ్రహీంపూర్‌లో పంచాయతీ కార్యదర్శి నర్సింహ అధ్యక్షతన జరిగిన ప్రజాపాలన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు, ఎస్సై దూదిమెట్ల నరేష్, ఏఎస్సై బత్తిని కట్టమల్లు, హెచ్ఎం శాంతికుమారి, మాజీ సర్పంచ్ కాసర్ల లక్ష్మయ్య, ఏఈఓ సౌజన్య, ఫీల్డ్ అసిస్టెంట్ గ్యార నాగరాజు పాల్గొన్నారు.



రఘునాథపల్లి: మాట్లాడుతున్న జగదీష్‌చందర్‌రెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

జనగామ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ అన్నారు. బుధవారం మండలంలో పెద్దపహాడ్, వడ్లకొండ, పట్టణంలోని 8,9,10,11,12, 13,14 మున్సిపల్ వార్డుల్లో నిర్వహించిన గ్రామ, వార్డు సభలను ఆయన పరిశీలించి ప్రభుత్వ అందజేస్తున్న పథకాలపై వివరించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, శ్రీనివాస్, మల్లారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహిందర్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ భరోసా



చెక్కు అందజేస్తున్న కిరణ్ కుమార్ గౌడ్

జనగామ: ఖరీదైన వైద్య పరీక్షల కోసం నిరుపేదలు పెద్దాస్పత్రులకు వెళ్లేందుకు సీఎం ఆర్ఎఫ్ భరోసా కల్పిస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ అన్నారు. జనగామ పట్టణంలోని నెహ్రూపార్కు 24వ వార్డుకు చెందిన గుండేటి అన్నపూర్ణ కేన్సర్ వ్యాధితో బాధపడుతూ ఆపరేషన్ కోసం కిరణ్ దృష్టికి తీసుకువెళ్లగా, స్పందించిన ఆయన సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.2.25లక్షల ఎల్ఓసీని మంజూరు చేయించారు. బుధవారం పట్టణంలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు ఎల్ఓసీని అందించిన అనంతరం మాట్లాడారు.అనంతరం తరిగొప్పుల మండల కేంద్రానికి చెందిన కె.సంధ్యకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆయన అందజేశారు. కార్యక్రమములో నాయకులు, కౌన్సిలర్లు రాందయాకర్, ముస్త్యాల చందర్, కొన్నె మహేందర్‌రెడ్డి, దూ డల సిద్ధయ్యగౌడ్, చిలువేరు సంపత్, తొట్టి నరేందర్, వేముల మల్లేష్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు ఉన్నారు.

రోడ్డభద్రతపై అవగాహన కలిగి ఉండాలి

జనగామ రూరల్: లారీ డ్రైవర్లు రోడ్డ భద్రతపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా రవాణా అధికారి జీవి శ్రీనివాస్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా బుధవారం జనగామ జిల్లాలోని లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లారీ డ్రైవర్లకు, ఓనర్లకు రోడ్డు అవగాహన కల్పించారు.

రోడ్డు భద్రత మనందరి బాధ్యత



రోడ్డు భద్రత మనందరి బాధ్యత అని ఎస్సైలు చెన్నకేశవులు, శ్వేత అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా నెహ్రూ యువ కేంద్రం (ఎన్‌వైకె) వరంగల్ వలంటీర్లు పురుషోత్తం, నవీన్ ఆధ్వర్యంలో రోడ్డుభద్రతపై అవగాహన కల్పించారు. అనంతరం పట్టణంలో మానవ హారం నిర్వహించారు. వలంటీర్లు పాల్గొన్నారు.

పాలకుర్తి టౌన్: విద్యార్థులు రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రగతి విద్యాలయంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు, ఎస్సై పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



లింగాలఘణపురం: సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఉన్నంత పవిత్రత ఏ వృత్తికి లేదని ఆ పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని ఎంఈఓ విష్ణుమూర్తి అన్నారు. బుధవారం మండలంలోని వనపర్తి ఉన్నత పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎంఈఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేటి తరం విద్యార్థులు ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకుని ఉన్నతులుగా ఎదుగాలని కోరారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

కొడకండ్ల: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పెద్దబాయితండాకు చెందిన గిరిజనులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పిల్లలను గురుకులాల్లో చేర్పించండి

చిల్పూరు: అత్యున్నత ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గురుకుల విద్యాలయాల్లో పిల్లలను చేర్పించాలని తెలంగాణ సాంస్కృతిక సారధి టీంలీడర్ పిన్నమల్ల సాంబయ్య కళాజాతా ద్వారా అవగాహన కల్పించారు. బుధవారం స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో కలెక్టర్, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి ఆదేశాల మేరకు కళాజాత నిర్వహించారు. ఆటపాటల ద్వారా గురుకుల విద్యాలయాల ఆవశ్యకతను ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో కళాకారులు బాలయ్య, శ్రీనివాసులు, చిరంజీవి, రవి, ఎడవెల్లి విజయ, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

బాలికలపై వివక్ష చూపొద్దు



బచ్చన్నపేట: తల్లిదండ్రులు పిల్లలను అందరిని సమానంగా చూడాలని బాలికల పట్ల వివక్ష చూపొద్దని తహసీల్దార్ ప్రకాశ్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని కేసిరెడ్డిపల్లి గ్రామంలో ఐసీడీఎస్ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బేటీ పడావో బేటీ బచావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కూతుళ్లను కూడా కుమారులతో సమానంగా చదివించాలన్నారు. నేడు వారు అందరితో పోటీ పడుతున్నారని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి అనిల్‌రాజ్, అంగన్‌వాడీ టీచర్ అంజుమ్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

రఘునాథపల్లి: సంగారెడ్డిలో ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన పార్టీ నాయకులతో కలిసి రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గంగపురం మహేందర్, కడారి ఐలయ్య, మైలారం వెంకటేశ్వర్లు, శాగ యాదగిరి, పొదల లవకుమార్, కడారి ఆంజనేయులు, దాసు, అక్షిత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు కలెక్టర్ నోట్‌బుక్స్‌ను పంపిణీ చేసినట్లు ప్రిన్సిపాల్ గీత తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కలెక్టరేట్‌లో కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషాను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపగా ఆయన వారికి నోట్ బుక్స్, జామెట్రీ బాక్స్‌లు, బ్లాంకెట్లను అందించారని చెప్పారు. ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీలు



జనగామ: జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకుని కలెక్టరేట్ ప్రాంగణంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. బాలికా సాధికారత, సంక్షేమం, నాయకత్వ లక్షణాలు, భద్రతకు సంబంధించిన చట్టాలపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించగా, ఆయా పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ పాల్గొని విద్యార్థుల ప్రతిభను ప్రత్యక్షంగా చూసి అభినందించారు.

'అసంపూర్తిగా రిజర్వాయర్లు'

పాలకుర్తి: పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ నిర్మాణం పనులు పూర్తి చేయడంలో ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో అసంపూర్తిగా ఉన్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సింగారపు రమేశ్ అన్నారు. బుధవారం రమేశ్ నాయకులతో కలిసి రిజార్వాయర్ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్ల నిర్మాణ పనులు ప్రారంభించి 14 సంవత్సరాలు దాటిని పర్తి చేయకపోవడం దారుణమన్నారు. సాగునీరు అందక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సారయ్య, సోమసత్యం, సోమన్న ఉన్నారు.

'కార్మెల్' విద్యార్థులకు చాంపియన్‌షిప్ ట్రోఫీ



పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్ విద్యార్థులు స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ ట్రోఫీ గెలుచుకున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ లిజీబేత్ బుధవారం తెలిపారు. మంచిర్యాల, గుడిపేటలో నిర్వహించిన 11వ ఇంటర్ స్కూల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ కార్మెల్ మీట్‌లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, త్రో బాల్, అథ్లెటిక్స్‌లో పాలకుర్తి కార్మెల్ హైస్కూల్ స్పెషల్ ఓవరాల్ ట్రోఫీని గెలుచుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ట్రైనర్లు శ్రీనివాస్,రాణాప్రతాప్, తిరుమల్‌రావును ప్రిన్సిపాల్ అభినందించారు.

దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్య తీసుకోండి

- కలెక్టర్‌కు బాధిత మహిళ వినతి

రఘునాథపల్లి: మండలంలోని జాఫర్‌గూడెంలో కొనుగోలు చేసిన భూమిని సేద్యం కోసం చదును చేస్తుంటే గ్రామానికి చెందిన ఇద్దరు తమపై దుష్ప్రచారం చేస్తూ మానసికంగా ఇబ్బందులు గురి చేస్తున్నారని బాధిత వృద్ధురాలు గోసికొండ సూర్యకళ బుధవారం మండల కేంద్రంలో విలేరురుల సమావేశంలో వెల్లడించారు. అవాస్తవాలు ప్రచారం చేస్తున్న ఇద్దరిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. తన భర్త జ్ఞాపకార్థం ఆయన స్వగ్రామం జాఫర్‌గూడెం సమీపంలో 1413, 1420, 1421 సర్వే నంబర్లలో 15.05 ఎకరాలను 2019లో కూతుర్ల పేర కొనుగోలు చేశామన్నారు. ఇందులోని 4–05 ఎకరాలు ఇదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కబ్జా చేసేందుకు యత్నించగా వారిపై కోర్టులో కేసు దాఖలు చేశామన్నారు. జిల్లా కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఇంజక్షన్ ఆర్డర్ జారీ చేయడంతో ఈ విషయం సబ్ జడ్జి పరిధిలో ఉంది. మిగతా భూమిని సేద్యం కోసం యంత్రాలతో చదును చేస్తున్నామన్నారు. తాము మట్టి తవ్వకాలు జరుపుతున్నారని బెదిరిస్తూ .. కోర్టులో దాఖలు చేసిన కేసు ఉపసంహరించుకోవాలని బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతున్నారన్నారు. అంతేకాకుండా పనులకు ఆటంకం కలగిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధురాలినైన తనను, తన కూతుర్లను మానసిక వేదనకు గురి చేస్తున్న ఇద్దరిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.



భూమి పత్రాలు చూపుతున్న బాధిత మహిళ

'న్యాయం చేయండి'

చిల్పూరు: తమ వ్యవసాయ భూమిని రాజకీయ పలుకుబడితో అక్రమంగా పట్టా చేయించుకుని డబ్బులు ఇవ్వకుండా బెదిరిస్తున్న వ్యక్తి నుంచి వాటిని ఇప్పించి న్యాయం చేయాలని బాధితులు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా చేర్యాలకు చెందిన బాధితులు పెద్ది రమేశ్, టేరాల రాజు, పెద్ది అంజయ్యలు మాట్లాడుతూ చిల్పూరు మండలం శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి వద్ద 2019లో 17 ఎకరాల 3 గుంటల భూమిని వ్యాపార నిమిత్తం ఎకరానికి రూ. 11 లక్షల చొప్పుల కొనుగోలు చేశామన్నారు. అదే సమయంలో సేల్ కం జీపీఏ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిపారు. అనంతరం ధరణిలో పట్టాదారు పాసుబుక్కు పొంది అమ్మిన మనోజ్‌రెడ్డికే భూమిని కౌలుకు ఇచ్చామన్నారు కొద్ది సంవత్సరాల అనంతరం డబ్బు అవసరం ఉండడంతో భూమిని విక్రయిస్తామంటే ఎవరూ కొనకుండా అడ్డుపడ్డాడని తెలిపారు. ఆ తర్వాత రాజకీయపలుకుబడితో అక్రమంగా పట్టా చేయించుకుని ఎకరాకు రూ.18 లక్షలకు విక్రయించాడని తెలిసిందని, ఈ విషయమై తాము అధికారుల చుట్టూతిరిగితే ఆ సమయంలో అతను బీఆర్‌ఎస్ లీడర్ కావడంతో ఎవరూ సహకరించలేదన్నారు. దీంతో తమకు తిరిగి డబ్బులు ఇవ్వమంటే కొంత ఇచ్చి మిగతా డబ్బులు అడిగితే బెదిరిస్తున్నాడని, ఈ విషయంలో న్యాయం చేయకుంటే ఆత్మహత్యే శరణ్యమని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న బాధితులు